# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 15, సెప్టెంబర్ 2025




మంత్రి సీతక్కకు వినతి పత్రం ఇస్తున్న సీఆర్‌టీలు (ఫైల్)

# జీతాలు ఇప్పించండి మహాప్రభో..




- ✧ అర్ధ వార్షికమైన అందని వేతనాలు
- ✧ జీతాలు లేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నాం
- ✧ ఇటీవలే ఆనారోగ్యంతో ఇద్దరు సిఆర్‌టిలు మృత్యువాత
- ✧ ప్రాణాలు పోతున్న పట్టించుకోరా!
- ✧ గిరిజన విద్య, ఉపాధ్యాయులపై చిన్న చూపు ఎందుకు..?
- ✧ గిరిజన ఒప్పంద ఉపాధ్యాయుల ఆర్థిక పరిస్థితి ఆగమ్య గోచరం

**ఉమ్మడి అదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**

సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాల, సింగిల్ స్కూల్‌లాల్లో విధులు నిర్వహిస్తున్న సిఆర్‌టిలు (కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్) ల ఆర్థిక పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ఆరు నెలలు గడవవస్తున్న ఇప్పటికి జీతాలు అందలేదు. ఒక ఉపాధ్యాయుడు మానసికంగా సరిగ్గా ఉన్నప్పుడే విద్యార్థులకు న్యాయం చేయగలడు అని గతంలో ప్రతి ఒక్క విద్యా కమిషన్లు చెప్పాయి. తద్వార ఉపాధ్యాయులకు గణనీయంగా జీతాలు పెరగడం జరిగింది. ఇది రెగ్యులర్ ఉపాధ్యాయులకు కానీ ఒప్పంద ఉపాధ్యాయుల పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది ఆరు మాసాలు నుంచి జీతాలు లేవంటే మామూలు విషయం కాదు చేసేదేమీ లేక అప్పులు చేస్తూ కాలం వెల్లదిస్తున్నారు. కానీ ఇప్పుడు అప్పులు ఇచ్చే వారు కూడా ఎవరూ లేరు. ఎందుకంటే జీతాలు ఎప్పుడు వస్తాయో వారికే తెలియకుండా పోయింది. అప్పులు ఇచ్చే వారు కూడా నమ్మని పరిస్థితి నెలకొంది. ఇటీవల ఆసుపత్రి వెళ్లలేక ఆర్థిక స్తోమత సరిగ్గా



లేక ఇద్దరు ఒప్పంద ఉపాధ్యాయులు మృత్యు వాత పడడం తెలిసిందే ప్రాణాలు పోతున్న పట్టించుకోరా అని సిఆర్‌టి లు ఆవేదన చెందుతున్నారు. వీరి సమస్యలపై ప్రతి ఒక్క ప్రజా ప్రతినిధులకు వినతుల ద్వారా వెళ్ళబుచ్చిన సమస్యకు మాత్రం పరిష్కారం లభించడం లేదు. దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించడం లేదు అన్న చందంగా మారింది వీరి పరిస్థితి. ప్రభుత్వం విధుల్లోకి తీసుకున్న అధికారులు మాత్రం ఈ విద్యా సంవత్సరానికి కొనసాగింపు ఉత్తర్వులు వెల్లడించక పోవడం వల్లే జీతాలు ఆలస్యం అవుతున్నాయని సిఆర్‌టి లు చెబుతున్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న గిరిజన విద్యాభివృద్ధికి వీరి కృషి అనిర్వచితం ఏజెన్సీ లోని మారుమూల ప్రాంతాల్లో, పర్వత ప్రాంతాల్లో, మిగతా 2లో..

## ఫోటోగ్రఫీ రంగ అభివృద్ధికి ఫోటో ఎక్స్పోలు అవసరం

**✻ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు**

**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**

కొమరంభీం జిల్లా కాగజ్‌నగర్ ఫోటోవీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19, 20, 21 తేదీలలో హైదరాబాద్ నార్సింగిలో నిర్వహించబోయే ఫోటో ఎక్స్పో పోస్టర్లను ఆదివారం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్స్పో ద్వారా కొత్త కొత్త సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక పరికరాలపై ఫోటోగ్రాఫర్స్ అవగాహన పెంచుకోవచ్చని, ఫోటోగ్రఫీ రంగానికి మరింత ప్రాధాన్యత లభించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ ఫోటోవీడియో అసోసియేషన్ సభ్యులు, జిల్లా అధ్యక్షుడు సమీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నీలి సతీష్, కోశాధికారి రాచర్ల వినయ్, కాగజ్‌నగర్ మండల అధ్యక్షుడు అనుమల్ల రాధాకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి కుందారపు రాజు, కోశాధికారి నాయరణ, కాగజ్‌నగర్ మండల మండల యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.





## జెండా ఊపి రైలును ప్రారంభించిన ఎమ్మెల్యే

**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**

కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ ఆదివారం ట్రైన్ నెం.12591 గోరఖపూర్ యశ్వంతప్పూర్ సూపర్ ఫాస్ట్ రైలుకు నూతనంగా నిలుపుదల ఇవ్వగా, సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్, ఆదివారం యశ్వంతప్పూర్ ఎక్స్‌ప్రెస్, మంగళవారం పాటలీపుత్ర ఎక్స్ ప్రెస్, గురువారం వందేభారత్ మిగతా 2లో..

## రేషన్ కోసం.. 20 కిలోమీటర్లు

**✻ వంకామదిపీటే గూడ గ్రామస్తుల ఆవేదన**

**లింగాపూర్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**

లింగాపూర్ మండలంలోని వంకామదిపిటే గూడ గ్రామ ప్రజలు ప్రతి నెల రేషన్ సరుకుల కోసం తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో డిపో లేకపోవడంతో, వారు నిత్యావసర సరుకుల కోసం దాదాపు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న నేట్నూరు గ్రామానికి వెళ్లాల్సి వస్తోంది. వాహన సౌకర్యాలు సమయానికి అందుబాటులో లేదు చాలా మంది కాలినడకన వెళ్లి రేషన్ బియ్యం తీసుకురావాల్సిన పరిస్థితి. ముఖ్యంగా వృద్ధులు, పండుముసలివారు మిగతా 2లో..



# జెండా ఊపి రైలును ప్రారంభించిన ఎమ్మెల్యే

(మొదటిపేజీ తరువాయి)

ఎక్స్‌ప్రెస్‌లకు కాగజ్‌నగర్‌లో హాల్టింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. దసరా, దీపావళి ముందు ఈ రైళ్ల హాల్టింగులతో ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యులు ప్రభాకర్ గౌడ్, భాజపా మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, అసెంబ్లీ కన్వీనర్ గొల్లపల్లి వీరభద్ర చారి, మాజీ కౌన్సిలర్ సింధం శ్రీనివాస్, అరుణ్ లోయ, చిలువేరు ప్రవీణ్, పవన్ బల్దేవ, ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షులు చిప్పకుర్తి శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి కొండ తిరుపతి, మంజుల, పుష్పలత, చేరాల శ్రీనివాస్, దూగుంట రాజన్న, రమేష్, పెద్ది హరీష్, సంజీవ్, చందు, అశోక్ ఆర్య, విలాస్, సౌరబ్, సంతోష్, సాయి, అనిల్, అతిక్, పురుషోత్తం, అధర్వ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కోసం 20 కిలోమీటర్లు

(మొదటిపేజీ తరువాయి)

ఈ ప్రయాణాన్ని తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో వాగులు పొంగిపొర్లే పరిస్థితుల్లో ఈ ప్రయాణం మరింత కష్టంగా మారుతోంది. ప్రస్తుతం బయోమెట్రిక్ ఆధారంగా రేషన్ పంపిణీ జరుగుతోంది. అయినప్పటికీ, ఈ అంతరాన్ని దాటి రావడం గ్రామస్తులకు పెద్ద సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో వంకామడిపేటగూడ గ్రామంలోనే డీలర్ డిపో మంజూరు చేయాలనీ గ్రామ ఉప సర్పంచ్ జాదవ్ తిరుపతి, గ్రామస్తులు జాదవ్ సరస్వతి, జాదవ్ కల్పన, పవార్ రామారావ్ తదితరులు అధికారులను వేడుకుంటున్నారు. గ్రామస్తుల విన్నపాన్ని పరిగణలోకి తీసుకుని, సంబంధిత శాఖలు త్వరితగతిన స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

## బాధ్యతలు చేపట్టిన రెబ్బెన ఎస్సై

**రెబ్బెన, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త:**




రెబ్బెన పోలీస్ స్టేషన్‌కు నూతన నూతనంగా బదిలీపై వచ్చిన ఎస్ఐ వెంకటకృష్ణ ఆదివారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాంతిభద్రతలు పరిరక్షణలో ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పన్నారు.

## ఈనెల 28న కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం

**కాగజ్‌నగర్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**

కాగజ్‌నగర్ పట్టణంలోని వినయ్ గార్డెన్‌లో ఈనెల 28వ తేదీన "కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం" నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు. ఈ సమ్మేళనంలో భవిష్యత్తు కార్యక్రమాలు, సీనియర్ కార్యకర్తల సూచనలు, సలహాలు స్వీకరించి, భవిష్యత్తులో వాటిని తూచ తప్పకుండా పాటించేందుకు ప్రణాళికను రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు.

## అనారోగ్యానికి గురైన బాల్య మిత్రునికి ఆర్థిక సహాయం

**జన్నారం, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**

మండలంలోని బాదంపల్లికి చెందిన బాల్య మిత్రుడు కవటం భూమన్న అనారోగ్యానికి గురైన విషయాన్ని తెలుసుకున్న 19871988 టెన్త్ క్లాస్మేట్స్ ఆర్థిక సహాయం అందించారు. ఆదివారం నాడు ఆ బాల్య మిత్రులు కొందరు రూ.26 వేలు జమ చేసి అతని ఇంటికి వెళ్లి అందజేసి, మానసికంగా ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవరశెట్టి శ్రీధర్, ఎం.హరికృష్ణ, బి.సుభాష్, బి.మని పాల్గొన్నారు.



# జీతాలు ఇప్పించండి మహాప్రభో..

(మొదటిపేజీ తరువాయి)

గుడలల్లో ఆశ్రమ పాఠశాల, సింగిల్ స్కూల్ లల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో 1204 మంది సిఆర్‌టిలు ఉన్నారు. జిల్లాల వారిగా ఆదిలాబాద్ జిల్లాలో 480, ఆసిఫాబాద్ జిల్లాలో 460, నిర్మల్ జిల్లాలో 160, మంచిర్యాల జిల్లాలో 104 మంది సిఆర్‌టి ఉపాధ్యాయులు కొనసాగుతున్నారు. వీరికి ఐదు నెలలుగా జీతాలు లేవు ఏప్రిల్, మే, జూన్, జులై, ఆగస్టు, ప్రస్తుత నెలతో ఆరు నెలలు గడవ వస్తున్న వేతనాలు అందలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొని ఉంది అని రాష్ట్ర వ్యాప్తంగా 2104 మంది సిఆర్‌టిలు ఉన్నారు. ఈ కాంట్రాక్టు ఉద్యోగం మీదే ప్రధానంగా ఆధారపడి జీవిస్తున్నారు. ఈ సంవత్సరం 2025-2026 విద్య సంవత్సరానికిగాను కొనసాగింపు ఉత్తర్వులు ఆర్థిక శాఖ నుండి ఇంకా వెలువడ లేదని సిఆర్టిల జీతాలు ట్రెజరీలో పాస్ చేయడం లేదు అని బడ్జెట్ మాత్రం గిరిజన సంక్షేమ శాఖ నుండి విడుదల అయినప్పటికీ జీతాలు మాత్రం రావడంలేదని ఆవేదన చెందుతున్నారు. అప్పుల బాధలు భరించ లేక చాలా మనోవేదనకు గురి అవుతున్నాం అని వాపోతున్నారు. గిరిజన విద్యాభివృద్ధి కొరకు అహర్నిశలు శ్రమిస్తున్నటువంటి ఉపాధ్యాయుల పై ఇంత చిన్నచూపు ఎందుకని గిరిజన విద్య పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి నిరూపించుకోవాలని ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి సిఆర్‌టిలకు వేతనాలు ఇప్పించాలని వారు కోరుతున్నారు.

# మున్సిపాలిటీల పరిధిలో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆదివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో మందమర్రి, క్యాతనపల్లి, చెన్నూర్ మున్సిపల్ అధికారులతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా చేపట్టిన నీటి ట్యాంకులు, ఇతర పనులను వేగవంతం చేయాలని, మున్సిపల్ పరిధిలో పారిశుధ్య నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ప్రతిరోజు ఇంటి నుండి తడి, పొడి చెత్తలను సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని తెలిపారు. ప్రతి ఇంటికి నిరంతరంగా త్రాగునీటిని సరఫరా చేసేలా పనులను పర్యవేక్షించాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని పన్నులను 100 శాతం వసూలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. వార్డులలో వీధి దీపాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను తమ పరిధిలోని అర్హులైన ప్రతి ఒక్కరికి అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, మున్సిపాలిటీలలో ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు సమన్వయంతో కృషి చేసి సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాయలింగు, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు మరమ్మతుకు నడుం బిగించిన గ్రామస్తులు

**✳ ఎవరో వస్తారని.. ఏమో చేస్తారని చూడకుండా శ్రమదానం**

**జైనూర్, సెప్టెంబర్ 14 , ప్రభాతవార్త:**

భారీ వర్షాలు కురవడం వల్ల రోడ్డు గుంతల మయంగా మారి ద్విచక్ర వాహనాలు ఆటోలు కూడ వెళ్ళని పరిస్థితి నెలకొనడంతో గిరిజనుల ఇబ్బందులు ఎవరు చెప్పినాపట్టించుకోకపోవడంతో స్వయంగా ఓ గిరిజన గ్రామ యువకులు నడుం బిగించి గుంతలు పడ్డ రోడ్డు పైమొరం బండలు వేసి మరమ్మతు పనులకుశ్రీకారంచుట్టారు. జైనూర్ మండలంలోని మారుమూల గిరిజన గ్రామ పంచాయతీ అయినా చింత కర్ర గ్రామపంచాయతీలోని చింతకర్ర తాటి గూడ, కిషన్ నాయక్ తండ వెళ్లే రోడ్డు భారీ వర్షాల కారణంగా అక్కడక్కడ గుంతల మయంగా మారడంతో ఎవరో వస్తారని ఏమో చేస్తారని చూడకుండా గ్రామ యువకులు ఆదివారం రోడ్డు మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. ఆ పంచాయతీకి ప్రభుత్వ బీటి రోడ్డు మంజూరు చేసిన అటవీశాఖ అనుమతులు లేక బీటి రోడ్డు నిర్మాణ పనులు జరిగాక ఉన్న మట్టి రోడ్డు వల్ల భారీ వర్షాలకు బురదమయంతో పాటు గుంతల మయంగా మారడంతో ప్రజలు చాలా రోజుల నుంచి ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు తగ్గడంతో ప్రజలు ఇబ్బందులను తీర్చేందుకు గ్రామ యువకులు రోడ్డు మరమ్మత్తు పనులను ప్రారంభించారు. శ్రమదానంతో యువకులు మరమ్మతులు ప్రారంభించడం పట్ల ఆయా గ్రామాల ప్రజలు యువకులను అభినందించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రోడ్డు అధ్వానంగా మారి అధికారులు సైతం రాకుండా ఉండడంతో ద్విచక్ర వాహనాలు ఆటోలు నడవకుండా ప్రజలు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని యువకులు శ్రమదానంతో రోడ్డు మరమ్మతులు చేయడం హర్ష నీయమని ఆయా గ్రామాల నాయకులు, ప్రజలు పేర్కొన్నారు.



గుంతలమయం రోడ్డుకు రోడ్డు మరమ్మతులు చేస్తున్న యువకులు